# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- పార్లమెంటు లో అర్ధవంతమైన చర్చలు జరగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు.
- చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన రెండు రోజుల పర్యటన ముగిసింది.
- రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయలేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ ” కార్యక్రమం 111వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.
- ఉపరితల అవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

======================

ప్రస్తుత 18వ లోక్ సభ సభాపతిగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కోటా లోక్ సభ సభ్యులు ఓం బిర్లా ఈ రోజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో పార్లమెంటు లో అర్ధవంతమైన చర్చలు జరగాలని, కొత్త సభ్యులకు మార్గదర్శకంగా ఉండేలా సభా కార్యక్రమాలు సాగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన ప్రభుత్వంలోని మంత్రివర్గ సభ్యులను ప్రధానమంత్రి సభకు పరిచయం చేశారు. కాగా, అంతకు ముందు లోక్ సభలో జరిగిన సభాపతి ఎన్నికలో విపక్ష కూటమి అభ్యర్థి కె సురేష్ మీద మూజువాణీ ఓటుతో ఓంబిర్లా గెలుపొందినట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి ప్రకటించారు. కాగా రాజస్థాన్ లోని కోటా లోక్ సభ నియోజకవర్గం నుంచి ఓం బిర్లా వరుసగా మూడోసారి గెలిచి ప్రస్తుత లోక్ సభలో అడుగుపెట్టారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా సభ్యులంతా ఆయనకు అభినందనలు తెలిపారు.

======================

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన రెండు రోజుల పర్యటన నేటితో ముగిసింది. ఈ రోజు ముఖ్యమంత్రి స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. సమస్యల మీద అధికారులతో సమీక్ష నిర్వహించి వాటిని సత్వరమే పరిష్కరించాలని వారిని ఆదేశించారు. అనంతరం కొద్ది సేపటి క్రితం ముఖ్యమంత్రి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయలేదని సాంఘిక సంక్షేమ, శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులతో జూలై 1వ తేదీన ఇంటింటికీ సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా షెడ్యూలు తెగలకు చెందిన విద్యార్థులకు ఆగిపోయిన ఫీజు బకాయిలను చెల్లిస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులో మాట" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ ద్వారా లేదా, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మాదక ద్రవ్యాల బారిన పడి యువత విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటోందని సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య అన్నారు. మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో ఈ రోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియచేయాలని పేర్కొంటూ..

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

మాదక ద్రవ్యాలను అరికట్టడం సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ భావించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలోని బీచ్ రోడ్ లో ఈ రోజు స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత తమ భవిష్యత్తును పూర్తిగా కోల్పోతోందని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మాదక ద్రవ్యాల రవణాను నియంత్రించేందుకు పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

2023-24 సంవత్సరంలో ఉత్తమ సేవా ప్రమాణాలను అందించినందుకు విజయవాడ ప్రాంతీయ పాస్ పోర్టు కార్యాలయంకు ఉత్తమ పాస్‌పోర్ట్ సేవా పురస్కారం లభించిందని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి కె. శివ హర్ష తెలిపారు . విజయవాడ లో ఈ రోజు అయ్యాన పాత్రికేయులతో మాట్లాడుతూ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ నుండి అవార్డు అందుకున్నట్టు తెలిపారు. 2023లో పౌరులకు 1.65 కోట్ల పాస్ పోర్టు సంబంధిత సేవలను అందించడం ద్వారా దాదాపు 15 శాతం వార్షిక వృద్ధిని సాధించామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

మలేరియా, అతిసార, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా సంబంధిత ప్రభుత్వ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సూక్ష్మమధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నియంత్రణపై ఈ రోజు విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జనావాసాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూడాలని, తాగునీటి వనరులు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలని మంత్రి సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. మలేరియా, డెంగీ కేసులు పెరగకుండా దోమల నివారణ చర్యలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తా జిల్లాల్లో రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే, భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశము ఉందని వెల్లడించింది . దక్షిణ కోస్తా రాయల సీమ జిల్లాల్లో సైతం మోస్తరు వర్షాలు పడతాయని వివరించింది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో రెవిన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తామని రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు రెవెన్యూ సర్వే శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై పలు ప్రాధాన్యతా అంశాల అమలు తీరును మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా రెవిన్యూ సేవలు ఉండాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందజేయడంలో రెవిన్యూ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాగా, రాష్ట్రంలో అమల్లో ఉన్న డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం, రీ సర్వే, న్యూ సిటిజన్ సర్వీసెస్ తదితర అంశాలపై అధికారులు మంత్రికి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారులలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపడతామని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పత్రికల్రేయులతో మాట్లాడుతూ,2 వేల 153 కోట్ల రూపాయలతో 5 వేల 731 రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారుల ప్రత్యేక మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా, రాష్ట్రంలో న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహాయంతో ఇప్పటి వరకూ 510 కోట్ల రూపాయలతో పనులు జరిగాయని మంత్రి జనార్ధన్ రెడ్డి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభా పక్ష నేతగా మాత్రమే గుర్తిస్తామని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అమరావతిలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధాన ప్రతిపక్ష హోదాకు తగిన శాసన సభ్యుల సంఖ్యా బలం లేనందువల్లనే ఆ గుర్తింపు ఇవ్వడం జరగదని అన్నారు. మొత్తం సభ్యుల్లో పదవ వంతు శాసనసభ్యులు ఉంటేనే ప్రతిపక్ష నేత హోదా ఇస్తారని మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలకు మంచి పరిపాలన అందిస్తానని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి సృజన అన్నారు. ఆమె ఈ రోజు ఆమె కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఆరోగ్యమే ప్రథమ లక్ష్యమన్నారు. విజయవాడ నగరంలో డయేరియా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు,సిబ్బందికి మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. ప్రకాశం భవనంలో పూర్తి చేసిన ఆధునికీకరణ పనులను ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రకాశం భవనంలో ఫ్లోరింగ్ ను గ్రానైట్ తో వేయడం జరిగిందన్నారు. ఇప్పుడు చేసిన ఆధునికీకరణ పనుల వల్ల ప్రజలకు,సిబ్బందికి మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =